తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT




సంపుటి: 1 సంచిక: 54 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: తెలంగాణ సోమవారం 23-09-2023 వెల: 5/రూ -



# అమీన్పూర్‌లో హైడ్రా కూల్చివేతలు



## పటేల్ గూడ లోని 12వ సర్వే నెంబర్ లో నాలుగు యంత్రాలతో హైడ్రా కూల్చివేతలు చేపట్టారు

## హైడ్రా కూల్చివేతలతో బాధితులు లబోదిబోమంటున్నారు

సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్ 22 (డైలీ రిపోర్ట్)

అమీన్ పూర్ లో ప్రభుత్వ స్థలాలను, బఫర్ జోన్ లో నిర్మించిన భవనాలను హైడ్రా కూల్చివేయడం ప్రారంభించింది. తెల్లవారు జాము నుంచే కూల్చివేతలు ప్రారంభమయ్యాయి.అమీన్ పూర్ లో అపార్ట్‌మెంట్లు,విల్లాలను కూల్చివేసింది. అమీన్ పూర్ లో నాలుగు ఎకరాల్లో అక్రమ నిర్మాణాలను చేపట్టారు అని అధికారులు గుర్తించారు. అపార్ట్‌మెంట్లు, విల్లాలను నిర్మించి కొందరు సొమ్ముచేసుకున్నారు.



బఫర్ జోన్ లో ఉన్నందున వాటిని కూల్చివేయడానికి నిర్ణయించినట్లు హైడ్రా అధికారులు విల్లాలకు, అపార్ట్‌మెంట్లకు నోటీసులు ఇచ్చారు. ఆదివారం తెల్లవారు జాము నుంచే కూల్చివేతలను ప్రారంభించిన హైడ్రా భారీ పోలీసుల బందోబస్తు మధ్య ప్రారంభించారు. నాలు ఎకరాల్లో యాభై భవనాలు, విల్లాలు కూడా ఉన్నాయి. అమీన్ పూర్ కృష్ణారెడ్డి పేట, పటేల్ గూడ ప్రాంతంలో ఈ అక్రమణ నిర్మాణాలను చేపట్టారు. స్థానికులు ఎవరూ అక్కడకు రాకుండా అడ్డుకుంటున్నారు. అమీన్‌పూర్ లోని ప్రభుత్వ స్థలంలో ముప్ఫయి విల్లాలను కూల్చివేస్తున్నారు. కూల్చివేతలలో ఒక ఆసుపత్రి కూడా నేలమట్టం చేశారు. విల్లాలు, అపార్ట్‌మెంట్లు, భవనాలు ఇలా అనేక రకాలుగా నిర్మాణాలను కూల్చివేతలను హైడ్రా ప్రారంభించింది. రియల్ ఎస్టేట్ వ్యాపారులు వీటిని నిర్మించినట్లు తెలుస్తోంది.

### బాధితుల కన్నీళ్లు...

అమీన్ పూర్ ఆక్రమణల తొలగింపు సందర్భంగా బాధితులు కంటతడి పెట్టారు . తమకు కనీసం నోటీసు కూడా ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారని అమీన్పూర్ మాజీ సర్పంచ్ చంద్రశేఖర్ మరియు బాధితులు హైడ్రా అధికారులపై మండిపడ్డారు. కోర్టులో స్టేటస్ లో ఉన్నా కూడా కూల్చివేతలు చేయడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల పాలిట శాపంగా మారారని అన్నారు. ఇంట్లో కిరాయి కి నివాసం ఉంటున్న వారి ఇండ్లను కూడా వదలకుండా ఇంట్లోని విలువైన సామాన్లు కూడా తీసుకోనివ్వలేదని, పోలీసులతో తమను అడ్డుకున్నారని వాపోయారు. సంవత్సరాల తరబడి నివాసం ఉన్న ఇండ్లను కళ్ల ముందే కూల్చేస్తుంటే బాధితులు కన్నీరు పెట్టడం చూపరులను కలచివేసింది. రెక్కల కష్టంతో తినీతినకా పొదుపు చేసిన సొమ్ముతో ఓ గూడు ఏర్పరుచుకున్నామని, ఇప్పుడు అధికారులు దానిని కూల్చేస్తున్నారని బాధితులు రోదిస్తూనే మీడియాతో చెప్పారు.

### స్థానిక అధికారులపై బాధితులు, ప్రజా సంఘాలు సీరియస్...

గతంలో అధికారులు ఇట్టి భవన నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చి ఇప్పుడు మాకేం పట్టనట్టు వ్యవహరిస్తుందని ప్రజాసంఘాలు మండిపడుతున్నాయి. దాదాపు రెండు మూడు సంవత్సరాల క్రితం జరిగిన ఇండ్లను ప్రభుత్వ భూములు కడితే తొలి దశలోనే కట్టడి చేయకుండా అడ్డగోలుగా పరిమిషన్లు ఇస్తున్నారు . ఇప్పటికైనా మామూలు మత్తులో జోగుతూన్న అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలి అని అన్నారు.కాసులకు కక్కుర్తి పడి పర్మిషన్లు ఇచ్చి ఇప్పుడేమో కూల్చివేయడం సరి కాదని మండిపడుతున్నారు. కనీసం నష్టపోయిన వారికి నష్టపరిహారమైన ఇవ్వాలని ప్రజా సంఘాలు అంటున్నారు .ఇకనైనా ఉన్నత అధికారులు అమీన్పూర్లో ప్రభుత్వ స్థలాల్లో పర్మిషన్ జారీ చేసిన అధికారుల జాబితాను బయటికి తీసి వెంటనే వారిని ఉద్యోగం నుంచి తొలగించాలని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.





## ‘అమృత్’లో అక్రమాలు తేలకపోతే రాజకీయ సన్యాసం

మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్

అమృత్ పథకం టెండర్లలో స్కాం నిజమే

సీవీసీ లేదంటే హైకోర్టు సీజే దగ్గరికి వెళ్దాం

ఫైళ్లు ముందుపెట్టి విచారణను కోరుదాం

కాంగ్రెస్‌పై మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

2లో



## ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త!

కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

జాగ్రత్తగా పనిచేస్తే రెండోసారి కూడా అధికారం మనదే..

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి చేర్చే బాధ్యత తీసుకోవాలి

గత 9 నెలల్లో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశా..

కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేస్తే కచ్చితంగా అవకాశాలు లభిస్తాయని వ్యాఖ్య

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేలకు వివరించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జాగ్రత్తగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు ఇవ్వొద్దని, ముఖ్యంగా అధికారుల పోస్టింగ్‌ల విషయంలో జోక్యం చేసుకోకుండా ఉంటే మంచిదని స్పష్టం చేసినట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో

2లో



## నిలబడతాం.. బలపడతాం

మా కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు

అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం

శాంతియుతంగా సమస్యల పరిష్కారం

భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు..

సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యాలు

క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ


2లో

## కాళేశ్వరం వృథా కాదు..

కాంగ్రెస్ ప్రభుత్వమే దానిని నిరూపించింది

మాజీ మంత్రి హరీశ్‌రావు

# కాళేశ్వరం వృథా కాదు..



(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచా రం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం అదే ప్రాజెక్టు వ్యవస్థను ఉపయోగించుకుంటోందని మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ బరాజ్‌లో కుంగిన మూడు పిల్లర్లను చూపుతూ మొత్తం ప్రాజెక్టు మీద రూ.లక్ష కోట్లు వృథా అయినట్లు ప్రజలను తప్పుదోవ పట్టించిందని మండిపడ్డారు. ఇప్పుడు మల్లన్నసాగర్, ఇతర ప్రాజెక్టుల్లో నీటిని నింపుతూ 'కాళేశ్వరం ప్రాజెక్టు వృథా'అని వారు సృష్టించిన సిద్ధాంతాన్ని వారే అబద్ధమని నిరూపిస్తున్నారని పేర్కొన్నారు. ఈ మేరకు హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాళేశ్వరం పంపింగ్ వ్యవస్థ ద్వారానే ఎల్లంపల్లి నీటిని ఎత్తిపోశారనే నిజాన్ని మంత్రి పొన్నం అంగీకరించాలన్నారు. కాంగ్రెస్ పాలనలో వివక్షకు గురై పెండింగులో ఉన్న ఎల్లంపల్లి ప్రాజెక్టు పనులను బీఆర్‌ఎస్ ప్రభుత్వమే పూర్తి చేసిందని హరీశ్‌రావు వెల్లడించారు. భూసేకరణ, పునరావాస కాలనీలు, కరీంనగర్ - మంచిర్యాల రాజీవ్ రహదారిపై హైలెవెల్ వంతెన.. తదితర పనులు పూర్తి చేసి ఎల్లంపల్లిని తమ హయాంలోనే నింపామన్నారు. గతంలో కాంగ్రెస్ చేపట్టిన ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం కేవలం 14 టీఎంసీలు కాగా, రీ ఇంజనీరింగ్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా 141 టీఎంసీలకు పెంచామన్నారు. ఎల్లంపల్లి నుంచి నీటిని లిఫ్ట్ చేసినా కూడా వినియోగించింది కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మాణం అయిన వసతుల వల్లే సాధ్యమైందని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టులో లింకు-1 పునరుద్ధరణపై దృష్టిపెట్టి, 2025 వానాకాలం పంటలకు నీరు ఇచ్చేలా మంత్రి పొన్నం ప్రభాకర్ కృషిచేయాలని హరీశ్‌రావు హితవు పలికారు.

**సీఎల్పీ భేటీకి అరికెపూడి ఎలా వెళతారు?**

శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ సమావేశానికి హాజరు కావడంపై మంత్రి శ్రీధర్‌బాబు చేసిన వ్యాఖ్యలు.. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్నట్లుగా ఉన్నాయని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 'సిద్దిపేట నియోజకవర్గానికి ముఖ్యమంత్రి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా వస్తే కలుస్తాను. కానీ ఎల్పీ మీటింగ్‌కు వస్తే కలవను, ఏ ఎమ్మెల్యే కలవకూడదు కూడా. పిల్లి కళ్లుమూసుకుని పాలు తాగినట్టుంది శ్రీధర్ బాబు వైఖరి'అని హరీర్‌రావు వ్యాఖ్యానించారు.

# ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త!

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడటం, పోస్టింగుల విషయంలో జోక్యం చేసుకోవడం వల్లే ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించినట్టు సమాచారం. అందువల్ల ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా పనిచేసుకుంటే.. రెండోసారి కూడా అధికారంలోకి వస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకారం నేపథ్యంలో.. ఆయనకు అభినందనలు తెలిపేందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సీఎల్పీ సమావేశమైంది. ఈ కార్యక్రమంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సన్మానించారు. మహేశ్‌గౌడ్ నియామకంపై పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీలో సమన్వయం తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు తీసుకెళ్లే బాధ్యతలను పార్టీ నేతలు తీసుకోవాలని కోరారు. "పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం. లోక్‌సభ సీట్లు గెలిచాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారికి పదవులు ఇచ్చాం. కష్టపడి పనిచేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో కచ్చితంగా అవకాశాలు వస్తాయి. నిబద్ధత కలిగిన నాయకుడు కాబట్టే మహేశ్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి వచ్చింది. బీసీల కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన. ఆయన ఆలోచన మేరకు రాష్ట్రంలో బీసీ కమిషన్ ఛైర్మన్, సభ్యులను నియమించాం. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే వారి జనాభాను లెక్కించాల్సిందే. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ సుప్రీం తీర్పును పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక ఇస్తుంది. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోదీ ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగోసారి గెలవడం కోసమే జమిలి ఎన్నికలు తీసుకువస్తున్నారు. ఈ ప్రతిపాదన పట్ల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలి.." అని రేవంత్ పేర్కొన్నారు.



**ప్రజల్లో ఉండేవారికే డీసీసీల బాధ్యతలు**

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఈ తొమ్మిది నెలల కాలంలో తాను ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశానని సీఎం రేవంత్ చెప్పారు. అధికారం కోల్పోయిన అసహనంతో ప్రతిపక్షం తప్పుడు ప్రచారాలు చేస్తోందని, ఆ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 27 రోజుల్లో రూ.18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదని.. తెలంగాణలో చేసి చూపించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తామని, రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రజల్లో ఉన్న వారికే కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులు వస్తాయన్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు వారానికి రెండు సార్లు తమ జిల్లాలో పర్యటించాలని సూచించారు.

# 'అమృత్'లో అక్రమాలు తేలకపోతే రాజకీయ సన్యాసం



ముఖ్యమంత్రి భార్యకు సృజన్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడని మంత్రి చెప్తున్నారు. భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలి. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ.8,888 కోట్ల అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలి. ఇప్పటికైనా జరిగిన తప్పును సీఎం ఒప్పుకొని అమృత్ టెండర్లను వెంటనే రద్దు చేయాలి.

**-మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 : కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్ల విషయంలో మంత్రి పొంగులేటి విసిరిన సవాలును స్వీకరిస్తున్నానని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అమృత్ పథకం టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. వెంటనే కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) లేదంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. 'నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం.. వెంటనే సిట్టింగ్ జడ్జితోని ఎంక్వయిరీ చేయిద్దాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పులు ఏం జరగలేదు అంటే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. హైకోర్టు సీజే దగ్గరికి రావడానికి మంత్రిగారికి ఇబ్బంది ఉందంటే డేట్, టైం ఫిక్స్ చేయండి ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ దగ్గరికి పోదాం. మంత్రిగారికి, ముఖ్యమంత్రికి ఒకటే చెప్తున్నా.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న ఫైల్స్‌తో పాటు ఇప్పటి టెండర్ల వ్యవహారం వివరాలు సీవీసీ లేదా రిటైర్డ్ జడ్జి ఎదుట ఉంచుదామని, న్యాయంగా తీర్పు చెప్పిన తర్వాత తాను చెప్పింది అబద్ధమంటే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం చేస్తానని స్పష్టంచేశారు. పొంగులేటి గతంలో కాంట్రాక్టర్‌గా ఉంటే ఉండొచ్చు కానీ ఈ రోజు మంత్రిగా ఉండి కాంట్రాక్టులు సంపాదించడం ముమ్మాటికి చట్టవ్యతిరేకమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని సీఎంతోపాటు మంత్రి పొంగులేటికి కూడా తెలుసని పేర్కొన్నారు. కేవలం రెండు కోట్ల లాభం ఉన్న బామ్మర్ది కంపెనీకి రూ.1000 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదంటే ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను కూడా తాను ప్రస్తావించిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఆగమేఘాలమీద ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహిం చారని తెలిపారు. ముఖ్యమంత్రి భార్యకి సూదిని సృజ న్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడని, భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలని నిలదీశారు. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ. 8,888 కోట్ల అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవా లని సూచించారు. ఇప్పటికైనా జరిగిన తప్పును సీఎం ఒప్పుకొని జరిగిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని సూచించారు. పొంగులేటి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే రాజీనామా చేయాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని, ఈ బరితెగింపు మాటలు మానివేయాలని సూచించారు. లేకుంటే గతంలో అశోక్ చౌహాన్, యడ్యూరప్ప, సోనియాగాంధీ పదవులు పోయినట్టు మీ పదవులు కూడా పోతాయని హెచ్చరించారు.

## నిలబడతాం.. బలపడతాం

### క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

వాషింగ్టన్, సెప్టెంబరు 22: "క్వాడ్ కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం. భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వాతావరణ మార్పులు, సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యం. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడమే క్వాడ్ అభిమతం. మేం(క్వాడ్ కూటమి) నిలబడతాం.. బలపడతాం" అని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్‌లో ఆదివారం జరిగిన క్వాడ్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లక్రితం ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, భద్రత వంటి అంశాలతో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్ కలిసి క్వాడ్ కూటమిగా ఏర్పడ్డ విషయం తెలిసిందే..! ఈ కూటమి ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన సదస్సులో మోదీ, బైడెన్‌తోపాటు.. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనెస్, జపాన్ ప్రధాని కిషిదా పాల్గొన్నారు. క్వాడ్‌కు వ్యతిరేకంగా చైనా వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో.. మోదీ ఆ దేశం పేరును ప్రస్తావించకుండా తాము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తామని, ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తమ సందేశం ఒక్కటేనని, బలంగా నిలబడి, సభ్యదేశాల సహకారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. "ప్రపంచంలో ఉద్రిక్తతలు, సంఘర్షణలు చోటుచేసుకుంటున్న సమయంలో క్వాడ్ కూటమి ఏర్పాటైంది. మానవాళి శ్రేయస్సుకు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కంకణబద్ధమైంది. క్వాడ్ సదస్సులో ఫలవంతమైన చర్చలు జరిగాయి. ప్రపంచానికి మేలు జరిగేలా ఇంకా సమర్థంగా పనిచేయాలని నిర్ణయించాం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి సహకరించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అంతకు ముందు ఆయన 'క్వాడ్ క్యాన్సర్ మూన్‌షాట్ ఈవెంట్'లో మాట్లాడుతూ.. ఇండో-పసిఫిక్ రీజియన్ దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, గుర్తింపు, చికిత్సకు భారత్ తరఫున రూ.62.61 కోట్ల(7.5 మిలియన్ డాలర్ల)ను అందజేస్తామని ప్రకటిస్తూ.. తమ లక్ష్యం 'ఒక భూగోళం.. ఒక ఆరోగ్యం' అంటూ నినదించారు. ఈ రీజియన్‌లోని దేశాలకు 4 కోట్ల డోసుల క్యాన్సర్ టీకాలను అందజేస్తామన్నారు.

## 'ఆయుష్మాన్' అమలుకు సిద్ధం

**రాష్ట్రంలో 70 ఏళ్లు పైబడిన వారు 5 లక్షల మంది**

**వారందరికీ ప్రత్యేకంగా ఆయుష్మాన్ కార్డుల అందజేత**


**పేద, ధనిక సంబంధం లేకుండా రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం**

హైదరాబాద్: డెబ్బై ఏళ్లు ఆపైబడిన వారందరికీ పేద, ధనిక తేడా లేకుండా ఉచిత వైద్యం అందించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని అమలు చేసేందుకు తెలంగాణలో రంగం సిద్ధమైంది. ఆ వయస్సు వారు తెలంగాణలో దాదాపు 5 లక్షల మంది ఉంటారని రాష్ట్ర వైద్య ఆరోగ్య వర్గాలు అంచనా వేస్తున్నాయి. వారందరికీ ఆయుష్మాన్ భారత్ పథకం కింద దేశవ్యాప్తంగా ఎక్కడైనా ఉచిత వైద్యం అందించనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ పథకం వెబ్‌సైట్‌లో తమ పేర్లు నమోదు చేసుకున్న వారికి ప్రత్యేకంగా ఆయుష్మాన్ కార్డులు అందజేస్తారు. ఆధార్ కార్డును ఆధారం చేసుకుని వయస్సును లెక్కించి కార్డులు ఇస్తారు. అలా కార్డులు పొందినవారు ఏదైనా అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరితే రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌కు పథకాల పేర్లలో తేడాలు ఉన్నా ప్రైవేటు, కార్పొరేట్ ఆసుపత్రుల్లో ఉచితంగా వైద్యం అందించడమే రెండింటి ప్రధాన ఉద్దేశమని అంటున్నారు. ఆరోగ్యశ్రీలో 77.19 లక్షల కుటుంబాలకు వైద్యం అందుతోంది.ఇందుకు ఏటా సగటున రూ.700 కోట్లు ఖర్చు అవుతున్నాయి. ఆయుష్మాన్ భారత్ అమలు చేస్తే, దీనికింద కవర్ అయ్యే 26.11 లక్షల కుటుంబాల కోసం సుమారు రూ.200 కోట్ల వరకూ కేంద్రమే భరిస్తుంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వంపై కొంత భారం తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఇప్పుడు ప్రత్యేకంగా 5 లక్షల మంది 70 ఏళ్లు పైబడిన వారికి కూడా వైద్యం అందితే అందుకు అవసరమైన నిధులను కేంద్రమే భరిస్తుందని వైద్యాధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఆరోగ్యశ్రీలో 972 రకాల వ్యాధులకు చికిత్స అందుతుండగా, ఆయుష్మాన్ భారత్‌లో 1,350 చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ఆయుష్మాన్‌లోలేని 540 వ్యాధులు ఆరోగ్యశ్రీలో ఉండగా, ఆరోగ్యశ్రీలో లేని 685 వ్యాధులు ఆయుష్మాన్‌లో ఉన్నాయి. దీంతో ఈ రెండింటినీ కలిపి అమలు చేయాలని వైద్య వర్గాలు అంటున్నాయి. ఉదాహరణకు డెంగీ, మలేరియా వంటి వాటికి ఆరోగ్యశ్రీ వర్తించదు. కానీ ఆయుష్మాన్ భారత్ పథకం వాటికి వర్తిస్తుంది. కిడ్నీ, లివర్ మార్పిడులు ఆరోగ్యశ్రీలో ఉండగా... ఆయుష్మాన్‌లో లేవు. ఈ రెండు స్కీంలు కలిపితే అన్ని చికిత్సలు ఒకే గొడుగు కిందకి వస్తాయి.

## సీపీఆర్ చేసిన కండక్టర్, డ్రైవర్

సీపీఆర్ చేసిన కండక్టర్, డ్రైవర్

**ప్రయాణికుడికి గుండెపోటు..**



జీడిమెట్ల: బస్సులో గుండెపోటు వచ్చిన ప్రయాణికుడికి సీపీఆర్ చేసి ఆస్పత్రికి తరలించిన కండక్టర్, డ్రైవర్‌ను టీఎస్‌ఆర్‌టీసీ యాజమాన్యం అభినందించింది. వివరాల్లోకెళితే.. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు జీడిమెట్ల డిపోకు చెందిన బస్సు బాలానగర్ నుండి జీడిమెట్ల వైపు వెళ్తోంది. ఐడీపీఎల్ వద్ద రామకృష్ణ(67) అనే ప్రయాణికుడు రన్నింగ్ బస్సు ఎక్కాడు. బస్సు గణేష్‌నగర్ బస్టాప్ దాటగానే ఆయనకు గుండెపోటు రావడంతో బస్సులోనే కుప్పకూలిపోయాడు. వెంటనే కండక్టర్ అంజలి డ్రైవర్ సైదులుకు విషయం చెప్పగానే బస్సు పక్కకు నిలిపాడు. ప్రయాణికుడిని మిగతా ప్రయాణికుల సహాయంతో కిందకు దింపి కండక్టర్ ప్రయాణికుడికి సీపీఆర్ చేశారు. మరో ప్రయాణికుడు కూడా ఇందుకు సహకరించాడు. దీంతో రామకృష్ణ కోలుకోగా..అతడిని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. ప్రయాణికుడు సేఫ్‌గానే ఉన్నాడని డాక్టర్లు తెలిపారు. సమయస్ఫూర్తితో ప్రయాణికుడి ప్రాణం కాపాడిన కండక్టర్ అంజలి, డ్రైవర్ సైదులును ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. డిపో మేనేజర్ ఆంజనేయులుతో సహా వారిని శనివారం బస్‌భవన్‌కు పిలిపించి శాలువాతో సత్కరించారు.






# డైలీ రిపోర్ట్ వార్తకు స్పందించిన అధికారులు






తరలించారు.. అలాగే అక్కడ సమీపంలో ఉన్న చెత్త చెదరాన్ని పంచాయతీ కార్మికుల చేత శుభ్రపరిచారు. ఇదొక్కటే కాకుండా పలు కాలనీల్లోకి పంచాయతీ సిబ్బంది మంచినీటిని వదలకుండా సమస్యను సృష్టించడం, ట్యాంకుల్లో బ్లీచింగ్ పౌడర్ కలుపడం, కలనీల్లోని మురికి నీటిని తరలించడానికి రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణలు, సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సోషల్ మీడియా వేదికగా స్థానికులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ముఖ్యంగా స్థానిక ప్రజాప్రతినిది అయిన మాజీ ఎంపీపీ ఇంటి పక్కనుండి రోడ్డు మార్గంలో హనుమాన్ మందిరం వైపు వెళ్లాలంటే డ్రైనేజీ నిర్మాణం లేక మురికి నీరు రోడ్డుపైకి రావడంతో మురికి కంపుతో ముక్కును మూసుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉందని ఆక్కడి కాలనీ ప్రజలు మరియు మందిరానికి వెళ్లే భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రజాపాలన ప్రారంబొత్సవ సమయంలో స్థానిక ప్రజలు రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసిందే.. మంత్రి ఇచ్చిన మాట ప్రకారం రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ నిర్మాణం చేపట్టి తాత్కాలిక పరిష్కారనికి నాంది పలికి శాశ్వత పరిష్కారనికి శ్రీకారం చుట్టాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి నియోజకవర్గం లొనే ఈ దుస్థితి ఉండడంతో కొంతమంది ప్రజలు ముక్కున వేలేసుకున్నారు..

డైలీ రిపోర్ట్ పత్రికకు కృతజ్ఞతలు తెలియజేసిన స్థానికులు: సంగారెడ్డి జిల్లా "రాయికోడ్ మండల కేంద్రంలో పడకేసిన పరిశుభ్రత" అనే వార్త డైలీ రిపోర్ట్ పత్రికలో శుక్రవారం ప్రచురితం అయిన వార్తకి స్థానిక మండల అభివృద్ధి అధికారి, పంచాయతీ కార్యదర్శి స్పందించారు. అధికారులు ప్రజలు ప్రభుత్వ కార్యాలయకు వెళ్ళే ప్రధానరోడ్డుపై ప్రవహిస్తున్న మురికి నీటిని కట్టడి చేసి, మురికి కాలువ నుండి నీరు రోడ్డుపైకి రాకుండా పక్కనే ఉన్న మురికి కాలువకు పైపులను జోడించి మురికి నీటిని

# ఏజెన్సీ ప్రాంతంలో చెర్వుల్లో శిఖం భూ ఆక్రమణ,అక్రమ కట్టడాలను తొలగించాలి: తుడుందెబ్బ,డిమాండ్



**మహబూబాబాద్, సెప్టెంబర్ 22(డైలీ రిపోర్ట్):** మహబూబాబాద్ జిల్లా లోని ఏజెన్సీ మండలాలైన కొత్తగూడ,గంగారం,గూడూరు,బయ్యారం లలో ఉండబడిన చెరువుల శిఖం భూములను ఆక్రమణ చేసి ఇటుక బట్టీలు వ్యవసాయ భూములు గా వినియోగిస్తున్న అధికారులు వాటి పైన విచార్ణ చేపట్టాలని అదేవిధంగా చెరువు పరిసర శిఖం భూమిలో ఇళ్ల నిర్మానాలు జరిగగాయాని అక్రమంగా చెర్వు ల్లో నిర్మించిన ఇళ్లను తొలగించి చెరువులను కాపాడటం కోసం చెరువుల నిర్మాణం చేసిన నాటి నక్షలను వెలికి తీసి ఆయా నక్షల ప్రకారం చెర్వు ల సరిహద్దులను నిర్ధారించి చెర్వు ల్లో అక్రమార్కులు ఆక్రమణ చేసిన భూములను పరిరక్షించి దానికింద ఉన్న ఆయకట్టు దారులకు న్యాయం చేయాలని ఆక్రమణలకు కారుకులైన వారి పైన క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి ని శిక్షించాలని షెడ్యూల్ ఏరియాలో 1/70 చట్టం అమలు లో ఉందని వలస వాదుల అధీనం లో ఆదివాసుల భూములు వేలాది ఎకరాలు ఉన్నాయాని చట్టానికి విరుద్ధంగా వారి వద్ద ఉన్న భూములను తిరిగి ఆదివాసీలకు ఇప్పించాలని అదే గాక ఏజెన్సీ చట్టాలను ఉల్ల%శీ%ఘించి గిర్జనేతరులు బహుళ అంతస్థులు నిర్మించుకొని ఆదివాసుల హక్కులకు విఘాతం కల్గిస్తున్నారని తక్షణమే ఆయొక్క నిర్మాణాలను సైతం తొలగించి ఆదివాసుల చట్టాలను పరిరక్షించే దిశగా జిల్లా కలెక్టర్ గారు చొర్వ చూపాలని తుడుందెబ్బ డిమాండ్ చేస్తుంది కార్యక్రమం లో ఆగబోయిన రవి,రాష్ట్ర కో కన్వీనర్,కుంజ నర్సింగరావు,ఆదివాసీ ప్రజా సంఘాల జిల్లా కన్వీనర్,పులసం మునేష్ ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు,పూనెం సందీప్ కుమార్ మండల అధ్యక్షులు,మల్లెల సారయ్య ప్రధాన కార్యదర్శి,సిద్దబోయిన లక్ష్మీ నారాయణ మండల ఉపాధ్యక్షులు,కల్తీ నరేష్ ఆదివాసీ సేన జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# సీఎంపై నిరాధార ఆరోపణలు

## కేటీఆర్‌కు దమ్ముంటే, ఆరోపణలు రుజువు చేస్తే మేము దేనికైనా సిద్ధం

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాల్

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో వ్యవసాయ మా ర్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అమృత్ స్కీం టెండర్లలో రూ.8,888 వేల కోట్ల అవినీతి జరిగిందని కేటీఆర్ తప్పుడు ఆరోపణలు చేశారని విమర్శించా రు. కేటీఆర్‌కు దమ్ముంటే, ఆరోపణలు రుజువు చేస్తే తాము దేనికైనా సిద్ధమని సవాల్ చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీ మారతుండడంతో అసహనానికి లోనై సీఎం రేవంత్‌రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే.. 'ఖబడ్దార్ కేటీఆర్'అని కోమటిరెడ్డి హెచ్చరించారు. ఎమ్మెల్యేలు, మున్సిపల్ చైర్మన్లు పార్టీ వదిలిపెట్టి పోతుండడంతో దిక్కుతోచని స్థితిలో కేటీఆర్ మాట్లాడుతున్నాడన్నారు. కేటీఆర్ పదేళ్లు మున్సిపల్ శాఖ మంత్రిగా పని చేసి రూ.7 లక్షల కోట్లు అప్పులు చేశాడని అందులో రూ.2 లక్షల కోట్లు ఆయనకు టుంబమే దోచుకుందని ఆరోపించారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ రోజురోజుకూ చచ్చిపోతోందని కోమటిరెడ్డి వ్యాఖ్యానించారు.

దోపిడీ దొంగలకు అలాగే కనిపిస్తుంది

హైదరాబాద్‌లో ఆదివారం సీఎల్పీ సమావేశం అనంతరం కూడా ఈ అంశంపై కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడారు. పచ్చకామెర్ల వాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు లాంటి దోపిడీ దొంగలకు తమ ప్రభుత్వం కూడా అవినీతి చేసినట్లుగా కనిపిస్తుందేమోనని వ్యాఖ్యానించారు. మిషన్ భగీరథ, కాళేశ్వరం ప్రాజెక్టులలో కేటీఆర్ వేలకోట్ల రూపాయలు దోచుకున్నాడని ఆరోపించారు. సింగరేణి సంస్థలో కవిత ఏం చేసిందో త్వరలో బయటకు వస్తుందని అన్నారు. వారి దోపిడీ ప్రజలకు అర్థమైంది కనుకనే గత ఎన్నికల్లో ఓడించారని చెప్పారు.



# పిప్పిరి గల్లంతైన మృతదేహం లభ్యం

ఆదిలాబాద్ జిల్లా డైలీ రిపోర్ట్ బ్యూరో: ఆదిలాబాద్ జిల్లా బజరత్నూర్ మండలంలోని వర్తమానూరు గ్రామానికి చెందిన ఆరెల్లి రాకేష్ (28) గణేష్ నిమజ్జనం సందర్భంగా పిప్పిరి గ్రామంలో శివారులోని చెరువులో పడి గల్లంతైన విషయం తెలిసింది సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని గజ ఈతగాళ్లతో సాయంతో మృతదేహాన్ని వెలికి తీశారు.

# నేడు బంగాళాఖాతంలో అల్పపీడనం.. భారీ వర్ష సూచన

## రాష్ట్రంలోని పలుచోట్ల మూడు రోజులు వర్షాలు కురిసే అవకాశం



హైదరాబాద్: పశ్చిమ, మధ్య బంగాళాఖాతం, మయన్మార్ దక్షిణ తీరం పరిసర ప్రాంతాల్లో రెండు ఉపరితల ఆవర్తనాలు కొనసాగుతున్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. వాటి ప్రభావంతో పశ్చిమ, మధ్య బంగాళాఖాతంలో సోమవారం అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు పేర్కొంది. అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులు రాష్ట్రంలోని చాలాచోట్ల మోస్తరు వర్షాలు, కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదు కావొచ్చని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు పలు ప్రాంతాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ప్రధానంగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు, ఒకట్రెండు చోట్ల అతిభారీ వర్షాలు కూడా నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది.

**31 శాతం అధికంగా వర్షాలు...**

నైరుతి సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 70.36 సెం.మీ. సాధారణ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఏకంగా 91.90 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం కంటే 31% అధికమని రాష్ట్ర ప్రణాళిక శాఖ అధి కారులు తెలిపారు. ఐదు జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, 19 జిల్లాల్లో అధిక వర్షపాతం, తొమ్మిది జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. సెప్టెంబర్ నెలాఖరుతో నైరుతి రుతుపవనాల సీజ న్ ముగుస్తుంది. సీజన్ ముగిసే నాటికి వర్షపాతం గణాంకాలు మరింత పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. ఈ ఏడాది నైరుతి సీజన్లో ఒక్క జిల్లాలో కూడా లోటు వర్షపాతం నమోదు కాకపోవడం విశేషం. మండలాలవారీగా వర్షపా తం నమోదును పరిశీలిస్తే 108 మండలాల్లో అ త్యధిక వర్షపాతం, 283 మండలాల్లో అధిక వర్షపాతం, 216 మండలాల్లో సాధారణ వర్షపాతం, 5 మండలాల్లో మాత్రం లోటు వర్షపాతం ఉన్న ట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి.



## స్పెషల్ సాంగ్‌కు త్రిష ఓకే

ఐటం సాంగ్స్‌లో నటించడానికి నటీమణులకు నిర్మాతలు భారీ మొత్తం చెల్లిస్తుంటారు. అందుకు ఉదాహరణ నటి తమన్నా. ఈమె చాలా చిత్రాల్లో ఐటమ్ సాంగ్స్ చేశారు. తాజాగా నటి త్రిష గోట్ (ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్ టైం) చిత్రంలో ప్రత్యేక పాటలో మెరవనున్నారు. దీని గురించి చాలా కాలంగా ప్రచారం జరుగుతున్నా, చిత్ర వర్గాలు గోప్యంగా ఉంచినట్లు సమాచారం. విజయ్ కథానాయకుడిగా ద్విపాత్రాభినయం చేసిన చిత్రం గోట్. వెంకట్‌ప్రభు దర్శకత్వంలో ఏజీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ నిర్మించిన ఇందులో ప్రశాంత్, ప్రభుదేవా, అజ్మల్, మైక్ మోహన్, ప్రేమ్‌జీ, నటి మీనాక్షీ చౌదరి, స్నేహ, లైలా తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు. యువన్‌శంకర్ రాజా సంగీతాన్ని అందించిన ఈ చిత్రం నిర్మాణ కార్యక్రమాలను పూర్తి చేసుకుని సెప్టెంబరు 5న భారీ ఎత్తున్న విడుదలకు సిద్ధం అవుతోంది. విశేషం ఏమిటంటే ఈ చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఇంత వరకూ నిర్వహించ లేదు. కారణం ఇంతకు ముందు విజయ్ నటించిన చిత్రాల ఆడియో విడుదల వేడుకల సమయంలో పలు సమస్యలు ఎదురు కావడమే కావచ్చు. అయితే గోట్ చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించేదీ, లేనిదీ త్వరలోనే వెల్లడిస్తామని క్రియేటివ్ నిర్మాత అర్చన ఇటీవల పేర్కొన్నారు. అయితే దాని గురించి ఇప్పటి వరకూ తెలపలేదు. ఇప్పటికే ఈ చిత్రంలోని మూడు పాటలు, టీజర్ విడుదలై గోట్ చిత్రంపై అంచనాలను పెంచేశాయి. తాజాగా నాలుగో పాటను త్వరలోనే విడుదల చేయనున్నట్లు దర్శకుడు వెంకట్ ప్రభు తెలిపారు. విజయ్‌తో నటి త్రిష నటించిన ప్రత్యేక పాటనే అయ్యి ఉంటుందనే ప్రచారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనికి సంబంధించి త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కాగా గోట్ చిత్రంలోని నాలుగవ పాట విడుదల కోసం విజయ్ అభిమానులు ఆతృతగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటివరకు త్రిష మరే సినిమాలోనూ ఐటం సాంగ్ చేయలేదు. విజయ్‌పై అభిమానంతో గోట్ సినిమాలో ప్రత్యేకమైన సాంగ్ చేసేందుకు గ్రీన్ ఇచ్చిందని కోలివుడ్‌లో ప్రచారం జరుగుతుంది.





## పీరియాడికల్ యాక్షన్ అడ్వెంచర్

కార్తీ కథానాయకుడిగా ఓ భారీ పీరియాడికల్ ఫిల్మ్ తెరకెక్కనుంది. ఇది కార్తి 29వ చిత్రం కావడం విశేషం. 'తానక్కరన్' సినిమాతో విమర్శకుల ప్రశంసలందుకున్న డైరెక్టర్ తమిళ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు, ఎషాన్ సక్సేనా, సునీల్ షా, రాజా సుబ్రమణియన్ నిర్మాతలు. కార్తీకి 'ఖైదీ' వంటి బ్లాక్‌బాస్టర్ అందించిన సంస్థలో నిర్మితమవుతున్న సినిమా కావడంతో ఈ సినిమాపై తమిళనాట భారీ అంచనాలు ఏర్పాడ్డాయి. ఈ సినిమాను 2025లో విడుదల చేయడానికి నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. త్వరలోనే ఈ పానిండియా సినిమా షూటింగ్ మొదలుకానుంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు స్టార్ట్ చేశారు. ఈ సినిమాకు సంబంధించిన ఇతర తారాగణం, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలో ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. డ్రీమ్ వారియర్స్ పిక్చర్స్, ఐవీ ఎంటైర్టైన్మెంట్, బిఫోర్‌యు మోషన్ పిక్చర్స్ ప్రతాకాలపై ఈ చిత్రం రూపొందనుంది.



## తెలుగు తెరపై తమిళ మందారం

ఈ అమ్మాయి పేరు అతిథి శంకర్. ఈ అందాలబొమ్మది సామాన్యమైన నేపథ్యం కాదు. దక్షిణాది సినిమాను పానిండియా స్థాయికి తీసుకెళ్లిన గ్రేట్ డైరెక్టర్ శంకర్ ముద్దుల తనయే ఈ ముద్దుగుమ్మ. ఈమె మంచి గాయని కూడా. వరుణ్‌తేజ్ నటించిన 'గని' సినిమాలో ఓ పాట కూడా పాడింది. ఎంబీబీఎస్ చదివింది. అసలు విషయం ఏంటంటే.. ఈ చెన్నై చందమామ త్వరలో కథానాయికగా తెలుగుతెరపై అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. సినిమా పేరు 'వీర ధీర శూర'. బెల్లంకొండ శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ఇందులో కథానాయకులు. ఇది తమిళ చిత్రం 'గరుడన్'కి రీమేక్. విజయ్ కనకమేడల దర్శకుడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతున్నది. అతిథి కూడా సెట్లోకి అడుగుపెట్టింది. ముగ్గురు స్నేహితుల కథగా ఈ సినిమా రూపొందుతున్నదని, స్నేహం, స్వార్థం, ప్రతీకారం నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని ఫిల్మ్ వర్గాల సమాచారం. ఈ సినిమాలో మరో కథానాయిక కూడా ఉందట. ఆమె పేరు త్వరలో ప్రకటిస్తారట.



## ప్రేక్షకుల నవ్వులు చూస్తుంటే సంతోషంగా ఉంది


'సినిమా చూసి అందరూ హార్ట్‌ఫుల్‌గా నవ్వుకుంటున్నారు. 'మత్తువదలరా' వరల్డ్‌లో బాబు లాంటి పాత్రను నాకిచ్చిన దర్శకుడు రితేష్‌కి, నిర్మాతలకు కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా. సత్యతో వర్క్ చేయడం వెరీ వెరీ హ్యాపీ. మా సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్.' అని కథానాయకుడు శ్రీసింహ కోడూరి అన్నారు. ఆయన, సత్య ప్రధానపాత్రధారులుగా రితేష్ రానా దర్శకత్వంలో రూపొందిన హిలేరియర్స్ థ్రిల్లర్ 'మత్తు వదలరా 2'. ఫరియా అబ్దుల్లా కథానాయిక. మైత్రీ మూవీమేకర్స్ సమర్పణలో క్లాప్ ఎంటైర్టైన్మెంట్స్ పతాకంపై చిరంజీవి(చెర్రీ), హేమలత పెదమల్లు కలిసి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. స్టార్ దర్శకులు గోపీచంద్ మలినేని, శివ నిర్వాణ, వివేక్ ఆత్రేయ, అనుదీప్, మహేశ్‌బాబు ఈ కార్యక్రమానికి అతిథులుగా హాజరై చిత్ర బృందానికి అభినందనలు అందించారు.

## సుస్వరాల మెకానిక్ రాకీ

యువహీరో విశ్వక్‌సేన్ నటిస్తున్న యాక్షన్ కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'. మీనాక్షి చౌదరి కథానాయిక. రవితేజ ముళ్లపూడి దర్శకుడు. రామ్ తాళ్లూరి నిర్మాత. దీపావళి కానుకగా అక్టోబర్ 31న సినిమా విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇప్పటికే విడుదల చేసిన తొలి పాటకూ, ఇతర ప్రచార చిత్రాలకు మంచి స్పందన వస్తున్నది. ఈ నెల 18న ఈ సినిమాలోని సెకండ్ సింగల్‌ని మేకర్స్ విడుదల చేయనున్నారు. 'ఓ పిల్లో..' అంటూ సాగే ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని, జెక్స్ బిజోయ్ స్వరపరిచిన ఈ పాటలో విశ్వక్‌సేన్, మీనాక్షి చౌదరిల లవ్లీ కెమిస్ట్రీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని మేకర్స్ చెబుతున్నారు. శ్రద్ధా శ్రీనాథ్, నరేష్, వైవా హర్ష, హర్షవర్ధన్, రోడీస్ రఘురామ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న .



## వర్మ భయానక ప్రేమ



ప్రఖ్యాత దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ దర్శకత్వ పర్యవేక్షణలో రూపొందుతోన్న చిత్రం 'శారీ'. 'టూమచ్ లవ్ కెన్ బి స్కేరీ' అనేది ఉపశీర్షిక. ఈ చిత్రానికి సమర్పకుడు కూడా రామ్‌గోపాల్‌వర్మే కావడం విశేషం. సత్యా యాదు, ఆరాధ్యదేవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. గిరికృష్ణ కమల్ దర్శకుడు. రవివర్మ నిర్మాత. నవంబర్‌లో సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఆర్జీవీ డెన్‌లో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఇది నిజజీవిత సంఘటనల మేళవింపుతో తెరకెక్కుతోన్న సైకలాజికల్ థ్రిల్లర్ అనీ, ఉత్తరప్రదేశ్‌లో ఎంతోమంది అమాయక మహిళలను మానభంగం చేసి, అతి క్రూరంగా చంపిన శారీ కిల్లర్ ఉదాంతానికి తెరరూపమే ఈ సినిమా అనీ, ఇందులో శారీ కిల్లర్‌గా సత్యా యాదు నటిస్తుండగా, తన అందంతో అతన్ని ఉన్మాదిగా మార్చిన అమ్మాయి పాత్రలో ఆరాధ్యదేవి కనిపిస్తారని మేకర్స్ తెలిపారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District Telangana state , Editor. B. shirisha print code TELTEL.2019/082422 , Cell 8501919707